


**2.784 కిలోల గంజాయిపట్టివేత**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 29 జూన్ , 2025 | పేజీలు : 06

# చండూరు మున్సిపాలిటీ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్

## సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకుంటూ అభివృద్ధి పరచుకోవల్సిన అవసరం ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో చండూరు మున్సిపాలిటీపై జరిగిన అభివృద్ధి సమీక్షాసమావేశంలో ఎంఎల్‌ఎ రాజగోపాల్‌రెడ్డి చండూరు మాస్టర్ ప్లాన్ పై పవర్ పాంట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని సూచనలతో చండూరు అభివృద్ధిపై మాస్టర్‌ప్లాన్ తయారు చేశారు. ముఖ్యంగా చండూరు మున్సిపాలిటీలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ,మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు ,రోడ్ల నిర్మాణం ,కూడళ్ల నిర్మాణం , వెజ్ అడ్ నాన్ వెజ్ మార్కెట్ , నూతనంగా మున్సిపాలిటీ నిర్మాణ భవనం , పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్ వంటి నిర్మాణాలపై యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. చండూరు రెవిన్యూ డివిజన్ గా మారిన తర్వాత భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని వారికి సరిపడ మౌళిక వసతులను కల్పించే విధంగా మాస్టర్ ప్లాన్‌ను నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రధానంగా డ్రైనేజీ సిస్టంపై లోతుగా అధ్యయనం చేసి దానికనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయనైనదని అన్నారు. ఈ యాక్షన్ ప్లాన్ రానున్న మూడు సంవత్సరాలలో విడుతల వారిగా అభివృద్ధి చేసుకోవాలని , ఈ అభివృద్ధికి సంబంధించిన నిధులను ప్రభుత్వంతో మాట్లాడి తీసుకొచ్చే బాధత ఎంఎల్‌ఏగా నాది అని రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ కు చెందిన మాస్టర్ ప్లాన్ సీనియర్ కన్సల్టెంట్ సుభాని, ఉమ్మడి నల్లగొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు , డిఈ మనోరమ, ఏఈ నాగ ప్రసాద్ , విద్యుత్ ఏఈ గణేష్ , చండూరు మున్సిపల్ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ , దోటి వెంకటేష్ యాదవ్, మంచుకొండ సంజయ్ , సంకోజు బ్రహ్మం , నల్లగంటి మల్లేశం , కల్లెట్ల మారయ్య, పన్నాల లింగయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్‌కు సిపిఐ నేతలు వినతిపత్రం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : రాచకొండ రెవెన్యూ పరిధిలోని భూములను సాగు చేసుకుంటున్న రైతులకు రెవెన్యూ అటవీ అధికారులు సంయుక్త సర్వే చేసి డిజిటల్ పాస్ బుక్‌లు అందజేయాలని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగు చేసుకుంటున్న రైతులకు అసైన్డ్ సీలింగ్ పోడు పట్టాలు ఇచ్చారని ఆ భూములనే గిరిజనులు, బంటు, బోయ, హరిజన రైతులు సాగు చేసుకుని జీవన కొనసాగిస్తున్నారని తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి రెవెన్యూ అటవీ శాఖల మధ్య హద్దుల వివాదం ఉన్నదని సాకుతో కొత్త పాసుబుక్కులు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి సిపిఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య, పందుల యాదగిరి, ఎర్రోళ్ల లింగయ్య,సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సత్తయ్యకు ఎమ్మెల్సీ పరామర్శ

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మునుగోడు మండల కేంద్రానికి చెందిన మాజీ ఈనాడు రిపోర్టర్ తిరందాసు శ్రీనివాస్ తండ్రి తిరందాసు సత్తయ్య ఇటీవల అనారోగ్యానికి గురై నల్లగొండ లోని విశ్వహృదయ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆయనను కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఉన్నారు.

## రూ.20 వేలు ఆర్ధిక సాయం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని ఎలగలగూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి అశోక్, కచలాపురం గ్రామానికి చెందిన నీరుడు సత్తయ్యలు మృతి చెందారు. శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అశోక్,సత్తయ్యల మృతదేహాలపై పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎలగలగూడెం సిపిఐ గ్రామ శాఖ తరపున ఈదులకంటి అశోక్ కు టుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



## గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు ధీటుగా జిల్లా ప్రభుత్వఆసుపత్రిలో వైద్య సేవలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి రెండింటిని పటిష్టం చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ సౌకర్యాలు కల్పిస్తున్నదని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన డాక్టర్ల బృందంలోని డాక్టర్లు శ్రీకాంత్, నిఖిత, దివ్య, అనస్తేసియా డాక్టర్లు డాక్టర్ బద్రి నారాయణ, పరమేశ్వరి,సుధ,గిరి లను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాకుండా,గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు ధీటుగా నల్లగొండ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి డాక్టట్లు అరుదైన శస్త్ర చికిత్సలు చేయడం పట్ల ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్లను అభినందించారు.ఆ తర్వాత మెడికల్ కళాశాల పక్కనే ఉన్న స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికై స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆ పక్కనే ఉన్న ఎస్ఎల్బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను తనిఖీ చేసి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా బాగా చదువుకోవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సహాయ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నగేష్‌రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ సహాయ డైరెక్టర్ డాక్టర్ నగేష్ తో పాటు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాని,ప్రభుత్వ ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృనాయక్ , ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ వినీల రాణి,రామచంద్ర ఉన్నారు.



## వ్యవసాయ చట్టాలపై అవగాహన



**ప్రజాపక్షం/చండూరు:** రైతులు వ్యవసాయ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డి , వ్యవసాయ కమిషన్ సభ్యులు ,లీప్ సంస్థ అధ్యక్షులు భూమి సునీల్ అన్నారు. శనివారం చండూరులోని భారతీచద్ర ఫంక్షన్ హాల్లో రైతులకు చట్టాలను చుట్టాలు చేయడం లక్ష్యంగా సాగు న్యాయ యాత్రలో భాగంగా రైతులతో కలిసి ప్రత్యక్ష సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ చట్టాలపై రైతులు పూర్తి అవగాహనతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రిక , ఈఓలు , ఆదర్శరైతులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సుకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు ఆహ్వానం

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ , గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో జూలై 13న హైదరాబాద్ గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్లో నిర్వహిస్తున్న గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, మహాత్మా చరక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి , ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం , డిసిసిబి చైర్మన్ కుభం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనుటకు వారిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి , సెక్రటరీ యానాల ప్రభాకర్‌రెడ్డిలు రాష్ట ఉపాధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు తో కలిసి ఆహ్వానించారు.



## మిర్యాలగూడకు పిజి వైద్య కళాశాల మంజూరు పట్ల హర్షం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడకు పీజీ వైద్య కళాశాల మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా చరిత్రలో మొట్టమొదటిసారిగా పీజీ వైద్య కళాశాల మంజూరైందని తెలిపారు. దీంతో మిర్యాలగూడ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన అత్యున్నత వైద్యం అందుతుందన్నారు. పీజీ వైద్య కళాశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా, ఉమ్మడి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తంకుమార్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లకు ఆయన అభినందనలు తెలిపారు.

## సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని 4, 16వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బంటు గిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందచేసి ఆయన మాట్లాడారు. ఈదులగూడ, భరత్‌గనగర్‌కు చెందిన అనేక కుటుంబాలకు నేటి వరకు వాటర్ పైపులైన్ కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న కనెక్షన్లను తొలగించాలని సూచించారు. ఈదులగూడ, హౌసింగ్‌బోర్డు, గొల్లగూడ ప్రాంతాల్లో రోడ్ల వెంబడి కంపచెట్లు దట్టంగా పెరగడం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి వీదులను శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు కొంగర వెంకటరమణ, మూల రాజిరెడ్డిలు ఉన్నారు.

## జూలై 1న కార్మికుల జనరల్ బాడీ సమావేశం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ జూలై 1న మిర్యాలగూడలోని మార్కెండేయ ఫంక్షన్‌హాల్‌లో కార్మికుల, యూనియన్ల జనరల్‌బాడి సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లోని అన్ని రంగాల్లో యూనియన్‌లో పనిచేస్తున్న కార్మికులు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, ముత్యాల లక్ష్మీనారాయణ, మాలి చిన రాములు తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటునే సామాజం ఆరోగ్యంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంతరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 25వ వార్డులో మున్సిపాలిటి వారు నిర్వహించిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరూ తడి, పోడి చెత్తను వేరుచేసి ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. వీధుల్లో సంచరించే కుక్కల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్లలో పెంచుకునే కుక్కలకు టీకాలు వేయించి మేడలో బెల్ట్‌లు వేయాలని, మున్సిపాలిటి వారు సరఫరా చేస్తున్న మంచినీటి నమూనాలను టెస్టింగ్ చేయించినట్లు తెలిపారు. నిరుపేద మహిళలకు స్వయం సహాయక సంఘాలపై అవగాహన కల్పించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, శ్వేత, భరత్, ఆర్‌పిలు నూకల విజయ, వెలుగు వాణి, నాగరాణి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు గుణాత్మకమైన విద్య

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అర్హత నిపుణులైన అనుభవజ్ఞులైనా ఉపాధ్యాయులచే గుణాత్మకమైన నాణ్యమైన విద్య అందించబడుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ఉజ్వల భవిష్యత్తుపై ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జిల్లా పరిషత్ సీఈవో శోభ రాణి మండల అభివృద్ధి అధికారి రాపర్తి భాస్కర్ కోరారు. పోచంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆమె ఎండిఓతో కలిసి శనివారం మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. జలాల్పూర్ లోనీ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం సందర్శించి జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన సోలార్ ఫెన్సింగ్ పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సౌజన్యంతో విద్యార్థినుల కోసం అందిస్తున్న బంకర్ బెడ్లను, మస్కిటో డోర్స్ ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని లబ్ధిదారులకు మేలు జరిగేలా సహకరించాలని ఆమె కోరారు. మండల పరిషత్ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణ అధికారులు ఆమె వెంట ఉన్నారు.

## రైతులకు సాగునీరు అందించాలి




**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** పిల్లాయిపల్లి కాలువలోకి వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు, బస్వాపురం రిజర్వాయర్ నుండి గోదావరి జలాలతో ప్రజలకు త్రాగు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల మండల కార్యదర్శి వర్గ సమావేశం కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. చౌటుప్పల్ మండలంలోని రైతాంగానికి కీలకంగా త్రాగు సాగుకు ఉపయోగపడుతున్న పిలాయిపల్లి కాలువ మరమ్మతులు వెడల్పు, లోతు కోసం నీటిని బందు చేసి నెల రోజులలో పూర్తి చేసి సాగు నీటిని విడుదల చేసి ఇస్తామని చెప్పి నిర్లక్ష్యంగా ఇరిగేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికే అనేక మంది రైతులు నార్లు పోసుకొని నీటి కోసం ఎదురు చూస్తున్నారని, నారు ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, బొజ్జ బాలయ్య, చింతల సుదర్శన్, బోయ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకే తన జీవితం అంకితం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజ సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని ఎమ్మెస్ వాణి సేవా సంస్థ ఛైర్మన్ ఎంవీఆర్‌రెడ్డి అన్నారు. అవంతీపురం మూగ, చెవిటి పాఠశాల విద్యార్థులు, యాచకులకు పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషీ జీవితంలో ఒకరికి సహాయం చేయడం కోసమే ఈ జన్మ ఉందని భావించి సమాజానికి తన వంతు బాధ్యతగా ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఇప్పటివరకు 25 సేవా కార్యక్రమాలు చేపట్టామని, వంద సేవా కార్యక్రమాలే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్ వాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సిపిఐ సంస్థాన్ నారాయణపురం మండల కార్యదర్శిగా భాస్కర్ ఏకగ్రీవం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం సిపిఐ మండల కార్యదర్శిగా దుబ్బాక భాస్కర్ ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సిపిఐ పార్టీ 15 మండల మహాసభలో ఆయనను తిరిగి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో 35 మంది కౌన్సిల్ మెంబర్లు, 9 మంది కార్యవర్గ సభ్యులు, మరో ఇద్దరిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శి మాట్లాడుతూ సిపిఐ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ప్రకటించారు. మండలంలో ప్రధాన సమస్య అయిన సాగునీటి కోసం రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలనీ పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తన ఎన్నికలకు సహకరించిన సిపిఐ పార్టీ నాయకత్వానికి పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## పెన్షనర్లు సామాజిక సేవలో ముందుండాలి



**ప్రజాపక్షం/కోదాడ:** విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య అన్నారు. శనివారం సంఘ కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతనలో జూన్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్‌న తర్వాత ఇంటి వద్ద ఒంటరిగా గడపకుండా ప్రతిరోజు సంఘ కార్యాలయానికి వచ్చి ఆట పాటలతో సంతోషంగా గడపాలని అన్నారు. అనంతరం జన్మదిన వేడుకలను జరుపుకునే వారికి కేక్ కట్ చేసి పంచిపెట్టి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, పొట్ట జగన్‌మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, విద్యాసాగర్, నర్సయ్య, భ్రమరాంబ, శోభ, రాఘువరప్రసాద్ పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. నిరుద్యోగులకు భృతి, మహిళలకు రూ.2500, ఆటో కార్మికులకు నెలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్ల పెంపు, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు వంటి హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, మోహన్‌నాయక్, రమేష్, జ్యోతి, రమణ, శ్రీను, సురేష్, ఇమ్మానియేల్, అరుణ్, నందూరి ఇమ్మానియేల్, జానకిరాములు, కిరణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.





## గురుపౌర్ణమి దీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా మిర్యాలగూడ రైల్వే కాలనీ శ్రీసాయిదత్త ఆశ్రమంలో శనివారం శ్రీసాయినాథ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట్ల నరేందర్‌లు జ్యోతి వెలిగించి దీక్షలను ప్రారంభించారు. గురస్వామి జానకిరాముడు భక్తులకు మాలధరణ చేసి దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రతాప్, కోశాధికారి మట్టయ్య, సోమన్న, జగన్నాధరావు, శ్రీనవాస్‌బాబు, అంజిబాబు, వాసు, విక్రమ్, వెంకన్న పాల్గొన్నారు.

## నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** లయన్స్‌క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాధమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ సభ్యులు శనివారం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులు చదవడ, రాయడం ఇంగ్లీష్ భాషను ధారళంగా చదవడం నేర్చుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హైమావతి, క్లబ్ సభ్యులు రిటైర్డ్ హెడ్ మాస్టర్ చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, సైదిరెడ్డి, కీత కనకయ్య, త్రిపురం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆదివాసి శిక్షణను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసి కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనం శిక్షణ తరగతులను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కోట్యనాయక్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటి డైరెక్టర్ ధారవత్ వీరన్ననాయక్ లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసి కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనంలో ఉమ్మడి నల్లగొండలోని ప్రతి మండల నుండి వచ్చిన ప్రతినిధులకు ఆదివాసి బంజారులు ఎదుర్కొంటున్న సమస్యలపై , రాజ్యాంగ మనకు కల్పించిన హక్కులతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయ అంశాలపై ప్రొఫెసర్లచే ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి శిక్షణ బంజార నాయకులు రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణ శిబిరానికి భోజన వసతితో పాటు అన్ని వసతులు కల్పించిన మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపిటిసి నాగమణి చత్రునాయక్, ధారావత్ రవి, భూక్య మహిందర్, సాయికుమార్ పాల్గొన్నారు.



# గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సందడి

**ప్రజాపక్షం/ హాలియా:** అన్ని అర్హతలు ఉండి తలదాచుకునేందుకు చిన్న గుడిసె లేక ఎండకు ఎండి వానకు తడుస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఒక అద్భుతమైన అవకాశం గా చెబుతున్నారు. ఇన్నాళ్ల తమ సొంత ఇంటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో తీరుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నారు. ఈ క్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు సుమారు 5 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా మొదటి విడత నియోజకవర్గం లో 3500 ల ఇందిరమ్మ ఇళ్లను



మంజూరు చేసి ముగ్గులు పోస్తున్నారు. ఇన్నాళ్లు కనీసం గూడు లేక అల్లాడుతున్న నిరుపేదలకు ఈ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వారికి వరమైందనే చెప్పాలి. దశాబ్దాల సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో నెరవేరుతుందని లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# స్వయం సహాయక సంఘం విధులు బాధ్యతలపై శిక్షణ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** స్వయం సహాయక సంఘం, గ్రామ సంఘంలో తుర్కపల్లి మండలంలోని అన్ని గ్రామాలో నూతనంగా ఎన్నుకోబడిన సంఘం పదాధికారులు, అధ్యక్షురాలు కార్యదర్శి కోశాధికారులకు వారి యొక్క విధులు, బాధ్యతలపై శిక్షణా కార్యక్రమాన్ని మహిళ సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘం, గ్రామ సంఘం నిర్వహణ, వివిధ ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం పౌష్టికాహారం పై పూర్తి అవగాహన కల్పించారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి పాల్గొని పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిఆర్పిలు, జిల్లా ఐబి, ఏపిఎం మల్లేశం, మండల ఏపీఎం చంచల యాదగిరి, సీసీలు పరుశరాములు, శివకుమార్, అకౌంటెంట్ లక్ష్మి , కంప్యూటర్ ఆపరేటర్ షాహిన్, పదాధికారులు, అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణలు సృష్టించిన పివికెది గౌరవం

### మాజీ ప్రధానిని విస్మరించిన ప్రభుత్వం.. కనీసం ఆయన విగ్రహానికి నివాళులర్పించని అధికారులు, నాయకులు..

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భాషా కోవిదుడు, ప్రజ్ఞాశాలి భారత రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన స్వర్గీయ భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు నల్లగొండ జిల్లా కేంద్రంలో అవమానం జరిగింది. శనివారం ఆయన 105 వ జయంతిని ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు విస్మరించారు. కనీసం ఆయన విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించని పరిస్థితి ఏర్పడింది. భారతదేశంలోనే తెలంగాణ నుంచి ప్రధానమంత్రి అయిన ఏకైక రాజకీయ దురంధరుడు పీవీ నరసింహారావు ఆయన భారతదేశంలో ఎన్నో నూతన ఆర్థిక సంస్కరణలు సృష్టించి తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన చెప్పిన మహామేధావి అయినా పీవీ నరసింహారావును ప్రజా ప్రతినిధులు , అధికారులు అవమానపరిచారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పీవీ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించి ఆయనకు సముచిత



గౌరవం ఇవ్వడంతోపాటు ఆయన విగ్రహాన్ని జిల్లా కేంద్రంలోని మున్సిపాల్ పార్కులో ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం పివీ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్మికులు ఆయన విగ్రహాన్ని శుభ్రం చేసి సిద్ధంగా ఉంచిన ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు నాయకులు గాని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసిన పాపాన పోలేదు. తెలంగాణ నుంచి మొట్టమొదటి సారిగా భారతదేశానికి ప్రధానమంత్రి అయి దేశ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసి న పీవీ నరసింహారావు జయంతిని విస్మరించడంతో విగ్రహం వేలవేల పోయింది. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న మహోన్నత వ్యక్తిని స్మరించుకోకపోవడం దురదృష్టకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని దోనియాల గ్రామంలో శనివారం మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు లబ్దిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ నాయకత్వంలో దేవరకొండ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, కొండమల్లేపల్లి మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూడావత్ మంగ్యనాయక్, మండల నాయకుడు విప్పలపల్లి



జితేందర్‌యాదవ్, రమేష్‌నాయక్, అంజయ్య, లింగం, సురేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మాజీ సైనికుల విభాగం కన్వీనర్‌గా శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల విభాగం కన్వీనర్‌గా జక్కుల శ్రీనివాస్ యాదవ్ ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్,జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్ సమక్షంలో శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో మాజీ సైనికుల విభాగం నూతన కన్వీనర్ జక్కుల శ్రీనివాస్ యాదవ్ ని పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, యాదవ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిది మతోన్మాద పాలన



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మోడీ పరిపాలనలో మహిళలపై, విద్యార్థులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలతో పాటు, మతోన్మాదం, హింస రోజురోజుకు పెరుగుతున్నాయని సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సిపిఎం నకిరేకల్ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు రాజకీయాలకతీతంగా జరిపే సార్వత్రిక సమ్మెకు సిపిఎం సంపూర్ణమైన మద్దతును తెలుపుతున్నామన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, విజ్ఞాన అధ్యక్షులు తాటి రమేష్‌లు శిక్షణ తరగతులను బోధించారు. క్లాసుల ప్రిన్సిపాల్‌గా పెంజర్ల సైదులు వ్యవరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల , బొంతల చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, బొజ్జ చిన్నవెంకులు, ఎస్సార్ వెంకటేశ్వర్లు , అవిశెట్టి శంకరయ్య, మల్ల మహేష్, చింతపల్లి బయ్యన్న రాచకొండ వెంకటేశ్వర్లు , జిట్ట సరోజ, మండల కార్యదర్శి చెరుకు పెద్దులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములను ప్రభుత్వమే నిర్వహించాలి

**ప్రజాపక్షం/మునగాల:** నాగార్జునసాగర్ ఎడమకాలువపై ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్లు స్కీమ్‌లను ప్రభుత్వం స్వాదీనం చేసుకుని ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో మండలస్థాయి పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, ఇన్పూట్ సబ్సీడీ అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి రెవిన్యూ సదస్సులు జరిపి వచ్చిన దరఖాస్తులపై నేటికి అమలుకు నోచుకోవట్లేదని ఆయన అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బుర్రి శ్రీరాములు, నెమ్మాది వెంకటేశ్వర్లు, ముల్కలపల్లి రాములు, ఎస్‌కె సైదా, జూలకంటి విజయలక్ష్మి , బచ్చలకూర స్వరాజ్యం, మండ ల కమిటి సభ్యులు చందా చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జూలకంటి కొండారెడ్డి, నాగయ్య ఆర్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.





## మదర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామ మదర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా లోడ వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా నర్రముల కృష్ణయ్య, బద్దం సుదర్శన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాల సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను ప్రతి ఒక్క రైతుకు అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రైతులకు ప్రభుత్వం తరుపున సబ్సిడిపై పశువుల దానా, మందులు అందే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్



**ప్రజాపక్షం/డిండి;** ఎంపిడివో కార్యాలయంలో శనివారం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ సెక్రటీరీలు, వివోఏలకు ఉల్లాస్ పై ఎంపిడివో వెంకన్న అధ్యక్షతన ఎంపిడివో కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి గోప్యనాయక్ మాట్లాడుతూ నిరక్ష్యరాస్యులయిన ప్రతి ఒక్కరిని అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్ యొక్క ఉద్దేశం అని తెలిపారు. ప్రతి ఒక్కరు కష్టపడి మండలాన్ని ముందు వరుసలో ఉంచాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు పాల్గొన్నారు.

## పాల సంఘం చైర్మన్‌గా గిద్దె సుధాకర్ ఘనవిజయం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలం దత్తాయపల్లి గ్రామంలో ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ ఎన్నికలు శనివారం రసవత్తరంగా జరిగాయి. ఈచైర్మన్ ఎన్నిక పోటీలో గ్రామానికి చెందిన కొడాలి రాజు, మామిండ్ల వెంకట రెడ్డి, గెలుపొందగా గిద్దె సుధాకర్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గిద్దె సుధాకర్ మాట్లాడుతూ తన గెలుపుకు సహకరించిన రైతులకు, పాల ఉత్పత్తి దారులకు, నాయకులకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సంఘం అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తూ రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఛైర్మన్ గా ఎన్నికైన తన తమ్ముడు గిద్దె సుధాకర్‌కు, మాజీ ఎంపీటీసీ గిద్దె కరుణాకర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాడి రైతులు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.




## వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వార్డు అధికారులు నిత్యం వార్డులలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ చౌటుప్పల్ మున్సిపల్ ఇంచార్జ్ ఎ.భాస్కర్ రావు అన్నారు. శనివారం మున్సిపల్ సంఘ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అవగాహన సదస్సు కార్యక్రమంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, ఆర్‌పిలతో మున్సిపల్ ఇంచార్జ్ భాస్కర్ రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో మున్సిపల్ సిబ్బంది వారి ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. వార్డులలో ఆర్ పిలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి బట్టలు, పారిశుద్ధ్య సామాగ్రి, సబ్బులు, నూనె, బెలం, మాస్కులు, రేడియం జాకెట్ ఇతర పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ్మారెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జూన్ నెలతో పదవీ విరమణ పొందుతున్న స్వీపర్ బోదుల బాలయ్య అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య దంపతులను కమిషనర్ కె.నర్సింహ్మారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తుల చెంతకే పూరి జగన్నాథుడు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భక్తుల చెంతకే పూరి జగన్నాథుడు వచ్చాడు. పూరి జగన్నాథం రథయాత్ర లో భాగంగా జిల్లా కేంద్రంలో శనివారం శ్రీమాన్ స్వరూప సిద్ది దాస్ భువనగిరి ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా కన్నుల పండుగగా రథయాత్రను భక్తులు జరుపుకున్నారు. ప్రత్యేక వాహనానికి పూల తోరణాలు అలంకరణలు చేసి జగన్నాథ బలభద్ర సుభద్రలను రథం పైకి ప్రతిష్టించి శాస్త్రోత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్రను టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి రథయాత్రను త్రాడు లాగి ప్రారంభించారు. దేవదేవుడు గర్భగుడి నుండి వదిలి భక్తుల చెంతకే జగనాథుడు తరలి రావడంతో పట్టణ పరిసరాలను పావనం చేస్తూ రథాన్ని స్వామి అధిరోహించాడు. భక్తుల జయ జయ ధ్యానాల నడుమ సుభద్ర బలపద్ర సమేతంగా బయలు దేరాడు. గుండె గొంతుగా చేసుకొని జనం జయహో జయహో జగనాథ అని కీర్తిస్తుంటే చిరు మందాసుడై ఆలకించాడు. రథయాత్ర హైదరాబాద్ చౌరస్తా నుండి ప్రారంభమై జగదేపూర్ చౌరస్తా, ప్రిన్స్ కార్నర్, అంబేద్కర్ చౌరస్తా, గంజి ఏరియా నుండి సాయిబాబా మందిరం వరకు కొనసాగింది. శ్రీకృష్ణ భక్తులు హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ హరి హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే సంకీర్తనతో మారు మ్రోగింది. అడుగు అడుగున భక్తుల కోసం వాటర్ ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్లు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భువనగిరి పట్టణం తోపాటు జిల్లా నలుమూలల నుండి కృష్ణ భక్తులు పాల్గొని నృత్యాలు, కీర్తనలు, భజనలు భక్తి పాటలతో సందడి చేశారు. రథయాత్రకు పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశాల్ ప్రభు, శ్రీనివాస్ ప్రభు, మార్తా వెంకటేశం, పసుపు నూరి నాగభూషణం, ముత్యాలు, బి లక్ష్మ ణ్, కృష్ణ, సోమచంద్రగుప్త, మారబోయిన అశోక్, విజయ్ ప్రభు, గోపరాజు కృష్ణ కాంత్ ప్రభు, ప్రశాంత్, ఆంజనేయులు ప్రభు, సత్యం, ఆదిత్య ప్రభు, గటికప్పుల శ్రీనివాస్, బిజెపి నాయకులు రత్నపురం బలరాం, ఉడుతా భాస్కర్, రత్నపురం శ్రీశైలం, పట్టణ కృష్ణ భక్తులు అధిక సంఖ్యలో మాతాజీలు పాల్గొన్నారు

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేసి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని బీజేవైఎం మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని దామర గ్రామంలో మార్నింగ్ వాక్ వెళ్లిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ నాంపల్లి మండలం మారుమూల ప్రాంతంలో ఉందని ఇక్కడ డిగ్రీ కళాశాల నైపుణ్యం వృత్తివిద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దీంతో విద్యార్థుల చదువు సులభతరం అవుతుందని అన్నారు.





## భవిత కేంద్రం నిర్మాణ పనులను పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవిత కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను పరిశీలించి మాట్లాడారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలను చేపట్టాలన్నారు. తహసీల్దార్ సురేష్, సిబ్బంది ఉన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజల ఆరోగ్యమే దేశ అభివృద్ధికి మూలస్తంభం అన్న ధ్యేయంతో, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో శనివారం పట్టణంలోని 5 వార్డ్‌లో గల దుర్గ కాలని,గరుడాద్రి కాలనీ, శ్రీనివాస్ కాలనీలో యూత్ కాంగ్రెస్ నాయకులు కంచర్ల ఆనంద్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కంటి సంబంధి త పరీక్షలను కంటి వైద్యుల చే త చేయించడం జరిగింది. అలాగే ప్రజలకి దగ్గర ఉండి కంటి చెకప్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ సిబ్బందిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో హరికృష్ణ అంకం శంకర్ అంకం శివ ప్రకాష్ గోపాల్ జానయ్య జక్కల లలిత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కంటికి రెప్పల కాంగ్రెస్



**ప్రజాపక్షం/కోదాడ:** పేదలకు కంటికి రెప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వానికి ఎంత కష్టం వచ్చిన పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలు ఆగవన్నారు. పేదలకు కడుపులో పెట్టుకుని చూసుకునే ప్రభుత్వం అన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోదాడ నియోకవర్గంలో 173 చెక్కులకు గానూ రూ.58 లక్షల 52వేల 500 లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, స్థానిక కాంగ్రెస్ పాల్గొన్నారు.

## వరుణుడి కరుణ కోసం గ్రామదేవతలకు జలాభిషేకాలు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలం పరిధిలోని చెర్వుగట్టు గ్రామంలో వర్షాభావ పరిస్థితులు తగ్గిపోవడంతో గ్రామ మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మేఘాలు కమ్ముకుని వర్షాలు కురవాలని, వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు నెలకొనాలని గ్రామ ప్రజలతో కలిసి వినాయక బొడ్రాయికి , ఆంజనేయ స్వామికి , గ్రామదేవతలకు జలాభిషేకాలు చేస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఈసందర్భంగా మాజీ సర్పంచ్ బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో సాగునీటి కష్టాలు నివారించాలంటే ప్రకృతి కరుణ అవసరమని, అందుకే భగవంతుని ఆశీర్వాదం కోరుతు ఈ పూజలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు నవీన్‌రెడ్డి, రమేష్, పెద్దకురుమ చీర యాదయ్య, మాజీ పెద్దకూర్మ చీర మల్లేష్, దయ్యాల మల్లయ్య, మచ్చ లింగయ్య, మందుల లింగయ్య, కడగంచి శంకర్, మోటే సోమనారి, మహేష్, శంకర్, నర్సింహ్మా, చందు, మధులు పెద్దసంఖ్యలో పాల్గోని భక్తిశ్రద్ధలతో వర్షాల కోసం ప్రార్థనలు చేశారు.



# పెద్దసూరారంలో పొలాలకు వెళ్లే రోడ్డుకు మోక్షం

### రూ.10 లక్షలు మంజూరు చేయించిన మంత్రి కోమటిరెడ్డి

### పూర్తయిన రోడ్డు-రైతుల హర్షం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో రైతులు వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రామంలోని తుమ్మలచెరువు నుంచి గుమ్మల బం పజ్జూరు లింకు రోడ్డు వరకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు గుంతలతో ఈ ప్రాంతం గుండా పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు అనేక అవస్థలు పడ్డారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి కోమటిరెడ్డి ఎస్ డి ఎఫ్ నిధులనుంచి రూ. 10 లక్షలు మంజూరు చేయించారు.నిధులు మంజూరైన వెంటనే అధికారులు 3 కిలోమీటర్ల పాటు తుమ్మలచెరువు నుంచి పజ్జూరు లింక్ రోడ్డు వరకు మట్టి రోడ్డు వేయించారు. దీంతో ద్విచక్ర వాహనాలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలు, ఎడ్ల బండ్లు, అరకలు వెళ్లడానికి అవకాశం ఏర్పడింది.గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రోడ్డు వేయడం పట్ల ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా శనివారం మాజీ ఎంపిటిసి పెండెం రత్నమాల పాండు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి యాదగిరి యాదవ్ లు, పలువురు రైతులు పూర్తయిన రోడ్డును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు.ఇటీవలనే ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయగా 10 రోజులలోనే అధికారులు రోడ్డు పనులు పూర్తి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తంతనపల్లి రామలింగం, గుండె వెంకన్న కోట్ల జలంధర్ రెడ్డి, ఎర్రమద నర్సిరెడ్డి, అబ్బగోని వెంకన్న, సిహెచ్ రవి, నిమ్మ కోటి రాజు, పిల్లి మల్లేశం, కే లింగయ్య, ముసుకు బిక్షం ,ముస్కు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట ఇండియన్ మెడికల్ ట్రస్టు చైర్మన్‌గా డాక్టర్ రామ్మూర్తియాదవ్ ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పేదల డాక్టర్‌గా పిలవబడుతున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ సూర్యాపేట ఇండియన్ మెడికల్ ట్రస్టు చైర్మన్‌గా శనివారం ఎన్నికయ్యారు. గత 30 ఏండ్లుగా సూర్యాపేటలో హస్పిటల్ నెలకొప్పి ఎంతోమంది పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించి మన్ననలు పొందుతున్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఉండ్రుగొండ లక్ష్మి నర్సింహస్వామి గిరి దుర్గం అభివృద్ధి కమిటి చైర్మన్‌గా సేవలు అందించడంతో పాటు మరొక శ్రీ కృష్ణ ట్రస్ట్ నెలకొల్పి ప్రతి సంవత్సరం సుమారు 1500 మందికి పేద విద్యార్థులకు స్కాలర్‌షిఫ్‌లను అందిస్తున్నారు. వీరి నియామకం పట్ల పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

## క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటూ

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/నాంపల్లి:** క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి రోజుకో గ్రామంలో పర్యటిస్తున్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. శనివారం మండల పరిధిలోని దామెర గ్రామానికి ఉదయమే చేరుకుని పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ వెంటనే అధికారులను పిలిచి పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా డ్రైనేజీలు రోడ్లు పరిశీలించి వెంటనే ఎంపీడీవో గ్రామ కార్యదర్శిలకు వారం రోజులు డ్రైనేజీ క్లియర్ సూచించారు. గృహాల మీద నుండి కరెంటు లూస్ లైన్స్ ఎక్కువగా ఉండడంతో కరెంటువిద్యుత్ శాఖ ఎయ్యితో సమస్యను వెంటనే ఈ సమస్యను పరిష్కరించుకొనులా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల వద్దకు వెళ్లి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మరి కొంతమందికి ఇల్లులు రాలేదని గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురా నిజమైన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారనే జాబితాను సిద్ధం చేయాలని స్థానిక నాయకులకు చెప్పారు. ఎంతమంది నిజమైన లబ్ధిదారులు ఉంటే అంతమందికి రెండవ విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు.దామర గ్రామ పర్యటనలో గౌరవ శాసనసభ్యులతో పాటు మండలాధికారులు తాసిల్దార్ దేవా సింగ్, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఏఈలు రామచంద్రయ్య, శివప్రసాద్ రెడ్డి అన్ని శాఖల గ్రామీణ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు ఎర్రెడ్ల రఘుపతి రెడ్డి, పూల వెంకటయ్య, మాజీ జెడ్పిటిసి వెలుగోటి వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్లు దామెర యాదగిరి, శ్రీను, నాయకులు పెద్దిరెడ్డి రాజు, మలిగిరెడ్డి చంద్రారెడ్డి, అబ్బనబోయిన చందు, నారాయణ రెడ్డి, నర్సింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సైదయ్య నాయుడు

**ప్రజాపక్షం/నిడమనూరు:** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా మండల పరిధి సూరేపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి సైదయ్య నాయుడును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య శుక్రవారం నియామక పత్రం అందజేశారు, పసుపులేటి సైదయ్య నాయుడు గతంలో మండల పరిధి వెనిగండ్ల సింగిల్ విండో చైర్మన్ గా పనిచేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు కులస్తుల సమస్యల సాధన కోసం కృషి చేస్తానని తనకు బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడు దేవయ్యకు ప్రధాన కార్యదర్శి జివిఆర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు పర్చాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లిః** రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హులకు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వతం నిరుద్యోగులకు అండగా ఉండటానికి రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొచ్చి, జూన్ 02 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం న నిరుద్యోగులకు పథకం ద్వారా నిధులు కేటాయిస్తామని ప్రకటించి, నేటి వరకు ఈపథకంపై ఏలాంటి ముందడుగు వేయలేదని ఆయన విమర్శించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దగూటి సుధాకర్, జిల్లా సహాయకార్యదర్శి వడ్డగాని మహేష్, మండల నాయకులు ఆమనగంటి గోపినాథ్, దుబ్బాక అరుణ్,నగేష్ పాల్గొన్నారు.



## నేడు పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** దివంగత బాలల కథా రచయిత పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారం జూలై 29 ఆదివారం నాడు నల్లగొండలోని ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రంలో విజయవాడకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త ముంజలూరి కృష్ణకుమారి కి ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సాగర్ల సత్తయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలైన డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, గరిపెల్లి అశోక్,మేరెడ్డి యాదగిరి రెడ్డి,పుప్పాల కృష్ణమూర్తి, మాదగాని శంకరయ్య,పెరుమాళ్ళ ఆనంద్ తదితరులు పాల్గొంటారని కవులుబ్,రచయితలు, సాహిత్యాభిమానులు , బాల సాహితీవేత్తలు పాల్గొననున్నారు.



## ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్

**ప్రజాపక్షం/ హాలియా:** నిత్యం పనిచేసే కార్మికుడికి లైఫ్ ఇన్సూరెన్స్ తప్పనిసరి అవసరమని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు లోని విశ్వబ్రాహ్మణులకు ఇన్సూరెన్స్ కార్డులను ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పరిధిలో ఉన్న విశ్వబ్రాహ్మణులు కూడా లైఫ్ ఇన్సూరెన్స్ తప్పనిసరి చేయించుకోవాలని చెప్పారు.తన తండ్రి కుందూరు జానారెడ్డి సొంత ఖర్చులతో ఈ కార్మికులకు లైఫ్ ఇన్సూరెన్స్ చేయించారని తెలిపారు. ఆ కార్డులను కార్మికులకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుభాషిణి ఉద్యోగ విరమణ




**ప్రజాపక్షం/తుర్కపల్లి:** మండలకేంద్రంలోని రంగా కన్వెన్షన్ హాల్లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పల్లె స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రము) జక్కుల సుభాషిని ఉద్యోగ విరమణ అభినందన సభను నిర్వహించారు. ఈ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి అతిగా విచ్చేసిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. 30 సంవత్సరాలు సుదీర్ఘంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అనేకమంది విద్యార్థులకు విద్యాదానం చేసిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పల్లెపహాడ్ గ్రామస్థులు, జక్కుల సుభాషిణి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సన్‌షైన్‌లో స్వచ్ఛదనం ... పచ్చదనంపై అవగాహన

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు మున్సిపాలిటీలోని సన్‌షైన్ పాఠశాలలో 100రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్ధులకు స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అందులో భాగంగా విద్యార్దులకు డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మా, ప్రిన్సిపాల్ రవికాంత్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అరవింద్‌రెడ్డి , వార్డు ఆఫీసర్ యాదయ్య ,విజయ , మంజుల ,రమేష్ తదితరులు పాలొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన నిర్మించుకోవాలి



## పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/పెనుబల్లి:** గ్రౌండింగ్ అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర గ్రామాల్లో పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో సమస్యలు ఉన్నాయా, ఇసుక ఉచితంగా ఇస్తున్నారా, అధికారుల సహకారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వంద శాతం చేయాలన్నారు. ముగ్గు వేయించి, రికార్డు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి మండలానికి 576 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 467 ఇండ్లు నిర్మాణాలు ప్రారంభం అవగా, పెనుబల్లి మండలంలో 612 మంజూరయిన ఇండ్లలో 541 ఇండ్లు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండలానికి ఎంత మేర ఇసుక, మట్టి అవసరమో, ముందుగానే డంప్ చేసుకోవాలని, ఎఇ ద్వారా సంబంధిత తహశీల్దార్ కూపన్లు జారీచేస్తారని, అట్టి కూపన్లతో లబ్ధిదారులు పొందవచ్చని అన్నారు. ప్రతి సోమవారం నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కొత్తూరు గ్రామంలోని రేకుల కాలనీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసుకొని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకొని గృహ ప్రవేశానికి పిలవాలని లబ్ధిదారులతో అన్నారు. అనంతరం పెనుబల్లి ఎంపీడీఓ కార్యాలయం లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వన మహోత్సవ కార్యక్రమం లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు.కలెక్టర్ క్షేత్ర పరిశీలన సందర్భంగా కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, ఎంపిడివో లు నాగేశ్వరరావు, అన్నపూర్ణ, తహశీల్దార్లు సత్యనారాయణ, నారాయణ మూర్తి, హౌజింగ్ ఏఇ లు పవన్ కళ్యాణ్, కమల్, అధికారులు తదితరులు ఉన్నారు.

# అందుబాటులో విత్తనాలు, ఎరువులు



## ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు
## -తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రైతులకు వ్యవసాయానికి కావాల్సినన్ని విత్తనాలు, ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్ సత్తుపల్లి లోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, మందుల లభ్యతను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ విత్తనాలు ఎక్కువగా అమ్ముడవుతున్నది, రైతులు అడిగే రకాలు అందుబాటులో ఉంచుతుంది అడిగి తెలుసుకున్నారు. ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరగాలని, మాన్యువల్ గా అంగీకరించేది లేదని కలెక్టర్ అన్నారు. ఈపాస్ మిషన్ పనితీరును పరిశీలించారు. విక్రయాల రిజిస్టర్లు నిర్వహించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండడంతో, రైతులు వరిపై మొగ్గు చూపుతున్నారని, అధిక లాభాలున్న హార్టికల్చర్ పట్ల రైతులను ప్రోత్సహించాలన్నారు. పామాయిల్ పంట చాలా లాభదాయకమని, అంతర పంటలుగా ఇతర పంటలను సాగు చేయవచ్చని అన్నారు. డ్రోన్ తో ఎరువుల, క్రిమీ సంహారకాల పిచికారీ తో ఖర్చు, సమయం ఆదా అవుతుందని అన్నారు. వ్యవసాయ అధికారులు, వారి వారి లక్ష్యం మేరకు విత్తన, ఎరువుల విక్రయ కేంద్రాల తనిఖీలు చేపట్టాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి. శ్రీనివాస రెడ్డి, సత్తుపల్లి మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాసరావు, అధికారులు తదితరులు ఉన్నారు.

# మహిళాసాధికారితే లక్ష్యంగా ముందుకు..

**ప్రజాపక్షం/ఇల్లెందు:** మహిళాసాధికారిత లక్ష్యంగా భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ) ముందుకు సాగుతోందని జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య పేర్కొన్నారు. పట్టణంలోని విఠల్‌రావు భవన్‌లో ఏర్పాటైన పట్టణ 3వ మహిళ మహాసభలో మాట్లాడారు. పోరాటాల ద్వారానే మహిళ హక్కుల రక్షణ కలుగుతుందని తెలిపారు. అలనాడు కేవలం వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్నిరంగాల్లో పురుషులకు ధీటుగా ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల రక్షణలో ముందంజలో ఉన్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం మహిళల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. క్రీడాకారుల పట్ల భాజపా మంత్రులు వ్యవహరిస్తున్న తీరు సామాజికంగా, మానసికంగా రెండోతరగతి శ్రేణి మహిళలను గుర్తిస్తూ బలహీనురాలుగా చేస్తున్నటువంటి ఘనత భాజపాకే దక్కుతుందని ఆరోపించారు. సమాజంలో అశ్లీలతలపై విస్తృతమైననటువంటి నీలిచిత్రాలు విడుదల చేస్తూ విదేశీ సంస్కృతిని మన దేశంలో కూడా విస్తృత ప్రచారం చేస్తున్న తీరుపట్ల నేటి యువత అటువంటి అశ్లీలతకు బానిసలుగా మారి మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారని, తక్షణమే కఠినమైన చట్టాలను అమలుచేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటిపై మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, సంఘం జిల్లా అధ్యక్షురాలు కమటం చంద్రకళ, నిర్వాహక అధ్యక్షురాలు కె.రత్నకుమారి, సహాయకార్యదర్శి ధనలక్ష్మి , కారం పద్మ, తడికల శ్రీలక్ష్మి , అలుగు సరిత,, బంధం లక్ష్మి , నాగలక్ష్మి , వడ్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.




# కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం కలెక్టర్ అనుదీప్‌ను శనివారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, వడ్డే నారాయణరావు, సూరంపల్లి రామారావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, దొడ్డా పుల్లయ్య, మట్టూరి వెంకటేశ్వరరావు, బోళ్ళ గంగారావు, కోసూరి శ్రీను, పమ్మి అశోక్, షేక్ సైదా, తోటకూర గోపి, మురళి, బాలు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని హైకోర్టు న్యాయవాది ఈపూరి నర్సింహస్వామి అన్నారు. శనివారం మండలంలోని మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అవసరమైన 1400 నోట్‌బుక్స్‌ను ఆయన పంపిణి చేసి మాట్లాడారు. తాను ఇదే పాఠశాలలో చదువుకోని ఇప్పుడు హైకోర్టు న్యాయవాదిగా ఎదిగానని అన్నారు. విద్యార్థులు పదవ తరగతితోనే విద్యను ఆపకుండా డిగ్రీ, పీజీలు చదివి ఉన్నత స్థానాలో ఉండాలని అన్నారు. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, రవ్వా శ్రీహరి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కూడా ఇక్కడే విద్యనభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని అన్నారు. అదేవిధంగా జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం దొడ్డి స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించిన నర్సింహస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. తమ పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నర్సింహస్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధర్మేందర్, స్టాఫ్ తిరుమల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్‌రెడ్డి, మంజుల, త్రివేణి, ప్రసాద్, మంజుల, సరోజ, కంచి రవి, కృష్ణయ్య, రాకేష్, అమరయ్య, గణేష్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సీపీఎం కార్యకర్త, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుడు బొడ్డుపల్లి మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం గ్రామశాఖ నాయకులు శనివారం మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.20వేల ఆర్థిక సహాయం అందచేసి పార్టీ పరంగా అండగా ఉంటామని అన్నారు. మల్లేష్ చిన్న వయస్సులో మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్, నాయకులు దోమలపల్లి నర్సింహా, కంకల శేఖర్, కునూరు గణేష్, మోటె స్వామి, సిలువేరు రాజు, గుంజె సైదులు, వర్కాల నాగరాజు, సిలువేరు వెంకటయ్య, మొగిలి ముత్యాలు, బొడ్డుపల్లి రాము, శివరాత్రి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వాలు
## -వసతి గృహాల వైపు కన్నెత్తి చూడని అధికారులు
## -ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వసతి గృహ విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభు త్వాలు మరిచాయని ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. చదువుకోవడానికి సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహాల విద్యార్థుల సమస్యల పట్ల అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు, బెడ్‌షీట్స్, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకుపెట్టెలు ఇప్పటి వరకు అందించలేదన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలన్నారు. హాస్టల్ వార్డెన్స్ స్థానికంగా లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పట్టించుకునే నాధుడే లేడన్నారు. వసతి గృహాల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. వెంటనే వసతి గృహ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, నాయకులు గోపి, రాహుల్, ప్రభాస్, నవీన్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.